

దుర్గమ్మ సేవలో సతీష్‌రెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి శుక్రవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.



దీక్ష విరమణ

మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి మాలధారణ చేసిన భక్తులు శుక్రవారం పాలకావడితో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దీక్ష విరమించారు.



కమ్మేసిన పొగమంచు

జిల్లాను పొగమంచు దట్టంగా కమ్మేస్తోంది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. విజయవాడ జీఆర్‌టీఎస్ రోడ్డులో శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలోని దృశ్యమిది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు బుద్ధుపవన్ కుమార్‌శర్మ, వేద పండితులు కొమ్మూరు ఫణికుమార్‌శర్మ బ్రహ్మత్వంలో శుక్రవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పంచామృతస్నపన, నిత్యహోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వసంతోత్సవం, అవభృత స్నానోత్సవం, శ్రీ సుబ్రహ్మణ్య మాలదీక్షా విరమణ, పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు వేదవిద్వత్ సభ, పండిత సత్కారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు గుడివాడ పాదర్తి సిస్టర్స్ చేసిన భరత నాట్యం భక్తులను అలరించింది. రాత్రి 9 గంటలకు రావివారిపాలెంలో తెనాలి వారు నిర్వహించిన శ్రీ షిర్డీ సాయిబాబా మహాత్యం నాటకం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ సీపీ ఎస్టీ, లీగల్ సెల్ కార్యదర్శుల నియామకం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఎస్టీ, లీగల్ సెల్ విభాగాల రాష్ట్ర కమిటీకి కృష్ణా జిల్లాకు చెందిన పలువురిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎస్టీ సెల్ కమిటీ కార్యదర్శిగా రమావత్ శ్రీకాంత్ నాయక్, సంయుక్త కార్యదర్శిగా సలా నాగరాజు, లీగల్ సెల్ కార్యదర్శి మహమ్మద్ రఫీ, జాయింట్ సెక్రటరీగా కేబీ గీత నియమితులయ్యారు.

ఆడపడుచులకు దిశ కంకణం



అతివలకు అన్ని విధాలా అండగా ఉంటున్న ప్రభుత్వం

- దిశ చట్టం, దిశ పోలీసు స్టేషన్లు, దిశ వన్ స్టాప్ సెంటర్లతో సేవలు
- దిశ యాప్‌తో తక్షణ సహాయం
- కృష్ణా జిల్లాలో మహిళలపై తగ్గుతూ వస్తున్న అఘాయిత్యాలు
- ఫ్యామిలీ కౌన్సెలింగ్‌తో కాపురాలు చక్కబెడుతున్న అధికారులు



బందరులోని దిశ మహిళ పోలీస్ స్టేషన్

సాక్షి, మచిలీపట్నం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే వారికి అవకాశాలు కల్పించడం, ప్రోత్సహించడంతో పాటు భద్రత కల్పించడం కూడా అంతే ముఖ్యం. స్వేచ్ఛగా సమాజంలో తమ హక్కులు పొందుతూ తమ ఆసక్తి మేరకు ఉద్యోగ, వృత్తి, స్వయం ఉపాధి, వ్యాపారాల్లో ప్రతిభ చాటాలంటే ఇది ఎంతో అవసరం. అప్పుడే వివక్ష తగ్గి సమానత్వం పెరిగి సాధికారత సాధ్యమవుతుంది. గత ప్రభుత్వాలు వీటిని ప్రకటనలకే పరిమితం చేశాయి. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. వారి సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తేవడంతో పాటు రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. దిశ చట్టం, దిశ పోలీస్ స్టేషన్లు, దిశయాప్, దిశ వన్ స్టాప్ సెంటర్ వంటి ఎన్నో రకాల సేవలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చి అమలు చేస్తోంది. వీటితో పాటు భార్యాభర్తల మధ్య ఏర్పడే మనస్పర్థలను తొలగించి సజావుగా కాపురాలు చేసుకునేలా ఇస్తున్న కౌన్సెలింగ్ కూడా సత్ఫలితాలు ఇస్తోంది. దీంతో కృష్ణా జిల్లాలో మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయి. మరోవైపు స్త్రీలను ఆర్థిక శక్తిగా మార్చేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు స్వయం ఉపాధి రంగాల్లో ఎదిగేలా అవకాశాలు కల్పిస్తోంది. చదువుతో పాటు తమకు నచ్చిన రంగాల్లో రాణిస్తున్న మహిళలు స్వేచ్ఛగా పనులు చేసుకునేలా అన్ని విధాలా అండగా ఉంటోంది.

దిశ పోలీస్ స్టేషన్లు..

రాష్ట్ర ప్రభుత్వం దిశ–2019 చట్టాన్ని తీసుకొచ్చింది. దీనితో పాటు మహిళలు తమ సమస్యలను నేరుగా చెప్పుకునేందుకు దిశ మహిళా పోలీస్ స్టేషన్లు తీసుకొచ్చింది. వీటిలో అత్యధిక శాతం మహిళా పోలీస్‌లు, సిబ్బందిని నియమించడంతో స్త్రీలు ఎలాంటి బెరుకు లేకుండా పోలీస్ స్టేషన్ ఆశ్రయించి తమ సమస్యలు చెప్పుకొని న్యాయం పొందుతున్నారు. దిశ వన్ స్టాప్ సెంటర్‌లో మహిళలకు పలు రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నారు. ఇక్కడ పోలీసు, వైద్య, కౌన్సెలింగ్, న్యాయ, సైకాలజీ సేవలు ఇస్తున్నారు. ప్రతి వారం ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించి భార్యభర్తల మధ్య నెలకొనే అంతరాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.

దిశ యాప్..

అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్లకు వెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం లేని మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ తీసుకొచ్చింది. ప్రతి మహిళ తమ సెల్ ఫోన్‌లో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని, యాప్ ద్వారా ఫిర్యాదు చేసినా పోలీసు అధికారులు స్పందించి వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. వారి సెల్ లొకేషన్ ఆధారంగా ఆ ప్రాంతానికి చేరుకుని నేరాలు జరగకుండా అడ్డుకుంటున్నారు.

తగ్గుముఖం పట్టిన నేరాలు..

- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు తగ్గుముఖం పట్టాయి. వివరాలను పరిశీలిస్తే.. 2022లో మొత్తం 1,291 కేసులు ఉండగా 2023లో 1,040కు తగ్గాయి.
- దిశ మహిళ పోలీస్ స్టేషన్‌లో 2021లో 1041 కేసులు, 2022లో 974 కేసులు, 2023లో 894 కేసులు పరిష్కారం అయ్యాయి.
- దిశ యాప్ ద్వారా తొలి ఏట 2021లో 341 ఫిర్యాదులు రాగా, 2022లో దీనిపై అవగాహన, నమ్మకం పెరిగి 877 మంది ఫిర్యాదు చేశారు. 2023లో 254 మంది సేవలు పొందారు.

మహిళల భద్రతకే ప్రాధాన్యం



మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. వీరి కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన దిశ మహిళ పోలీస్ స్టేషన్, దిశ యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి. ఇళ్లలో, పనిచేసే ప్రాంతాల్లో, రోడ్లపైన ఇబ్బందులకు గురైతే భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలి. నిష్పక్షపాతంగా విచారణ జరిపి, నిందితులు ఎవరైనా శిక్ష పడేలా చూస్తాం. ఫ్యామిలీ కౌన్సెలింగ్‌తో అనేక కుటుంబాలను నిలబెడుతున్నాం.

– అద్నాన్ నయీమ్ అస్మి, ఎస్పీ, కృష్ణా జిల్లా

భద్రత పెరిగింది..



రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. గతంలో లేని విధంగా దిశ చట్టం, దిశ పోలీసు స్టేషన్లతో పాటు దిశ యాప్‌ను తీసుకొచ్చింది. దీని వల్ల ఎక్కడ సమస్య ఎదురైనా సెల్ ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసే వీలు కల్పించారు. దీంతో గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లే వారిలో భయం ఉండేది. ఇప్పుడు ధైర్యం వచ్చింది.

– వెలివెల లీనారాణి, ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌శాతం పెంచడానికి తమవంతు సహకారం అందించాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. రాజాబాబు కోరారు. శుక్రవారం ఆయన చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

అభ్యంతరాలకు పరిష్కారం..

కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణ అయిన తర్వాత ఫారం -6, 7, 8 దరఖాస్తులు 21,880 వచ్చాయన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి విచారణ జరిపి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 9,612 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ఇంకా 12,268 దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛత కోసం బూత్‌స్థాయి అధికారులు ఓటర్లను విచారిస్తున్నారన్నారు.

- ఓటర్లుగా నమోదైన వారు జాబితాలో వారి పేరును ఒకసారి పరిశీలించుకోవాలని కోరారు. ఈ విషయమై రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా వారి పరిధిలో విస్తృతంగా ఓటర్లకు తెలియజేయాలన్నారు.
- ఓటర్ల నమోదు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని 18 సంవత్సరాలు నిండి అర్హత కలిగిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు నామినేషన్లు వేసే తేదీ వరకు అవకాశం ఉందన్నారు.
- గర్భిణులు, బాలింతలు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక వసతులను కల్పించటంతో పాటు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు.
- కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో పోలింగ్‌పై అవగాహన కల్పిస్తున్నామని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైకల్యం ఉన్న వ్యక్తులు, 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

డీఆర్వో చంద్రశేఖరరావు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర, సీపీఎం నాయకుడు కొడాలి శర్మ, కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్‌మతీన్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దుర్గాకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

కోనేరుసెంటర్: జిల్లాలో పోలీసు సిబ్బంది శాఖాపరంగా పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి హామీ ఇచ్చారు. పోలీసు సిబ్బంది సమస్యలను పరిష్కరించే దిశగా శుక్రవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు దర్బారును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది సమస్యలను సావధానంగా ఆలకించి పరిష్కారం చూపుతానని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల నుంచి పోలీసుతో పాటు హోంగార్డులు ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. కొంత మంది బదిలీల కోసం అర్జీలు పెట్టుకోగా, మరి కొందరు అనారోగ్యంతో బాధపడుతూ శాఖాపరంగా అవసరమైన సహాయ సహకారాలను కోరారు.



సిబ్బంది సమస్యలను ఆలకిస్తున్న ఎస్పీ అద్నాన్

క్లుప్తంగా

వడ్డీతో బీమా మొత్తాన్ని చెల్లించండి

వినియోగదారుల కమిషన్ ఆదేశం

చిలకలపూడి(మచిలీపట్నం): వడ్డీతో బీమా మొత్తాన్ని వినియోగదారునికి చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల శుక్రవారం తీర్పు చెప్పారు. గుడివాడ పట్టణానికి చెందిన వసంతవాడ శ్రీనివాస్ హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రూ.15 లక్షలకు జీవిత బీమా పాలసీ తీసుకున్నారు. పాలసీ అమలులో ఉండగానే శ్రీనివాస్ మరణించారు. దీంతో నామినీగా ఉన్న భార్య వి.రాట్నాలకుమారి ఇన్సూరెన్స్ కంపెనీకి క్లెయిమ్ చేయగా వారు అనారోగ్య కారణాలు ఉన్నాయని తిరస్కరించారు. దీంతో ఆమె వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలు విచారించిన అనంతరం కమిషన్ సభ్యులు 2022 సెప్టెంబరు 20వ తేదీ నుంచి ఇన్సూరెన్స్ మొత్తం రూ.15 లక్షలు 9శాతం వడ్డీతో చెల్లించాలని రూ.10 వేలు ఖర్చుల నిమిత్తం తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా ఫిర్యాదుదారునికి అందజేయాలని తీర్పు చెప్పారు.

పార్కులో గేటు విరిగి పడి బాలుడి దుర్మరణం

కోనేరుసెంటర్: పార్కు గేటు ఊడిపడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో శుక్రవారం జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని పట్టాభిపురానికి చెందిన వడ్డే లక్ష్మీకాంత్ కారు నడుపుతుంటాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, జవహర్ పబ్లిక్ స్కూలులో చదువుకుంటున్నారు. చిన్న కుమారుడు వడ్డే దినేష్‌కుమార్ (8) యూకేజీ చదువుతున్నాడు. రోజు లానే శుక్రవారం పాఠశాలకు వెళ్లి వచ్చిన దినేష్ ఇంటికి సమీపంలో డీఈవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న పార్కులో ఆడుకుని వస్తానని తల్లితో చెప్పి వెళ్లాడు. అక్కడ ఆటలాడుకుంటూ పార్కు ప్రధాన గేటు పట్టుకుని వేలాడుతుండగా గేటు ఒక్కసారిగా విరిగి ధబేలుమని దినేష్‌పై పడిపోయింది. దీంతో తలకు తీవ్రంగా గాయమై దినేష్ స్పృహ కోల్పోయాడు. ఈ సంఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానికులు కుటుంబ సభ్యులకు విషయం చెప్పగా తల్లిదండ్రులు, బంధువులు బాలుడిని చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దినేష్ మృతి చెందాడు. అప్పటి వరకు ఆటలాడుతూ స్నేహితులతో సరదాగా గడిపిన దినేష్ ఒక్కసారిగా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవటంతో తల్లిదండ్రులు, బంధువులు భోరున విలపించారు. దినేష్ మృతితో పట్టాభిపురంలో విషాదఛాయలు అలముకున్నాయి. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సర్కారీ దవాఖానాల్లో తల్లీ,బిడ్డ భద్రం

- విస్తృతంగా మాతా శిశు సంరక్షణ సేవలు
- గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు నిరంతర పర్యవేక్షణ
- ప్రసవం తర్వాత తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచితంగా ఇళ్లకు తరలింపు
- నిర్ణయించిన నెలల్లో ఉచితంగా స్కానింగ్
- ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా బ్యాంకు ఖాతాలకు రూ.5 వేలు నగదు బదిలీ


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి వెళుతున్న బాలింత(ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మాతా శిశు సంరక్షణ సేవలు విస్తృతంగా అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రతి గర్భిణిని ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షిస్తుంటారని చెప్పారు.

ఉచిత స్కానింగ్ సేవలు

ప్రతి గర్భిణికి వైద్యాధికారి పరీక్షలు చేయడంతో పాటు, నిర్ణయించిన నెలల్లో స్కానింగ్ సేవలు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రులతో పాటు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈ సేవలు అందుతాయన్నారు. గర్భిణీలలో ప్రమాదకర లక్షణాలను గుర్తించిన వారికి టిఫా స్కాన్‌ను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వైద్యులు సూచించిన మేరకు ఈ స్కానింగ్ చేస్తారని స్పష్టం చేశారు.

ప్రభుత్వ పథకాలు వర్తింపు

గర్భిణులకు ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా రూ.5 వేలు అందించనున్నట్లు తెలి పారు. అందులో భాగంగా గర్భం దాల్చిన తర్వాత 12 వారాల్లోపు రూ.3 వేలు, ప్రసవం తర్వాత రూ.2 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ అకౌంట్‌కు నగదు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. రెండవ కాన్పులో ఆడబిడ్డకు జన్మనిస్తే, బిడ్డకి టీకాలు అనంతరం ఒకేసారి రూ.6 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం అయిన వారికి గ్రామీణ ప్రాంతం వారికి రూ.వెయ్యి. పట్టణ ప్రాంతం వారికి రూ.600 చెల్లిస్తున్నట్లు తెలిపారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు

గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం జరిగిన తర్వాత తల్లీబిడ్డను ఉచితంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లలో ఇంటికి చేర్చుతున్నట్లు తెలిపారు. కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల సమయంలో రక్తహీనత కలిగిన గర్భిణులను గుర్తిస్తే అలాంటి వారిని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటి నుంచి ఆస్పత్రికి ప్రసవం కోసం తీసుకెళ్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. ఈ సేవల కోసం 104 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గర్భిణులకు రక్తం ఎక్కించాల్సి వచ్చినప్పుడు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లి, చికిత్స అనంతరం ఇంటికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవలను జిల్లాలోని గర్భిణులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సుహాసిని కోరారు.

పోలీసులకు ఫైరింగ్ ప్రాక్టీస్

ఫైరింగ్‌లో పాల్గొన్న ఎస్పీ


ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొని సిబ్బందికి ఫైరింగ్ చేసి చూపిస్తున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): జిల్లాలోని ఏఆర్, సివిల్ పోలీసులకు శుక్రవారం మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌కు సమీపంలో ఉన్న ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పాల్గొని సిబ్బంది ప్రాక్టీస్‌ను పరిశీలించారు. సిబ్బందితో పాటు ఎస్పీ కూడా ఫైరింగ్‌లో పాల్గొని సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫైరింగ్‌లో సిబ్బంది మంచి తర్ఫీదును పొంది శాఖాపరంగా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఫైరింగ్‌లో నెలకొన్న సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఫైరింగ్ చేసే సమయంలో పోలీసుల దృష్టి టార్గెట్‌పైనే ఉండాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పోలీసుశాఖ ఉన్నతికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎస్పీ ఫైరింగ్ శిక్షణపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఫైరింగ్ ప్రాక్టీస్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై రథసప్తమి వేడుకలు


వెంకటేశ్వరస్వామి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శుక్రవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ విజయకీలాద్రి దివ్యక్షేత్ర ఏడవ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథసప్తమి పురస్కరించుకుని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పరిపూర్ణ మంగళ శాసనములతో ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం సామూహిక ఆదిత్య హృదయస్తోత్ర పారాయణ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజయకీలాద్రి ఆలయ పెరుమాళ్ల అందరికీ అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం జరిగినట్లు తెలిపారు. వెంకటేశ్వరస్వామి వారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారని వివరించారు. సాయంత్రం స్వామి వారు గరుడ వాహనంపై విజయకీలాద్రి గిరి పరిక్రమణ జరిగిందన్నారు.

వృద్ధురాలు సజీవ దహనం


మంటల్లో కాలిపోయిన వృద్ధురాలు సీతామహాలక్ష్మి (ఫైల్)

మోపిదేవి: మండల కేంద్రమైన మోపిదేవిలో పెను విషాదం చోటుచేసుకుంది. గురువారం అర్ధరాత్రి పూరిగుడిసెలో నివసిస్తున్న కందుల సీతామహాలక్ష్మి(77) ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఆ మంటల్లో వృద్ధురాలు కాలిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట మేకల వారి వీధికి చెందిన కొమ్మువరపు రాములుకు ముగ్గురు సంతానం, పెద్ద కుమారుడు, కుమార్తెలకు వివాహాలయ్యాయి. కొంత కాలం కిందట రాములు భార్య బేబి గుండెపోటుతో మృతి చెందింది. తల్లి మరణంతో కుంగిపోయిన రెండో కుమారుడు నాగార్జున మద్యానికి బానిసయ్యాడు. డ్వాక్రాలో పని చేసే నాగార్జున కొంత కాలంగా అనారోగ్యంగా ఉండటంతో డాక్టర్లు మద్యం తాగవద్దని చెప్పారు. అయితే గురువారం రాత్రి నాగార్జున మద్యం తాగి వచ్చి ఇంటి ముందు పడిపోయాడు. దీంతో తండ్రి, అన్న కలసి నాగార్జునను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడంతో రాత్రి 9 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

రేపు విజయవాడలో అక్కినేని శత జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం సినీ నటుడు, నిర్మాత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు చీదెళ్ల నాగేశ్వరరావు తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో ఆదివారం సాయంత్రం జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి పాల్గొంటారని, సినీ నటుడు మాగంటి మురళీమోహన్‌కు అక్కినేని జాతీయ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్నామని తెలిపారు.

దేవతా మూర్తులకు జలాధివాసం


దేవతా మూర్తులకు జలాధివాసం నిర్వహిస్తున్న అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి నూతన ధ్వజ స్తంభ సహిత స్వర్ణ శిఖర కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో మూడో రోజైన శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శాంతి పాఠం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు హోమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, దేవస్థాన వేద పాఠశాల విద్యార్థులు యాగశాలలో మంటప పూజలు, మంటప హోమం, అంగహోమాలను నిర్వహించారు. ఆలయ వేద పండితులు, ఆలయ అర్చకులు వేద పఠనాన్ని ముక్తకంఠంతో పఠించగా, మల్లేశ్వరాలయం మారుమోగింది. ఉదయం స్వామి వారి ఆలయానికి చేరుకున్న ఈవో కేఎస్ రామారావుకు యాగశాలలో జరుగుతున్న పూజలు, హోమాల గురించి ఆలయ వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ శర్మ, మురళీశర్మ వివరించారు. మధ్యాహ్నం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు, వేద పండితుల పర్యవేక్షణలో దేవతామూర్తులకు జలాధివాసం నిర్వహించారు. ఉత్సవాలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా వైభవంగా నిర్వహించాలని ఆలయ ఈవో రామారావు ఇంజినీరింగ్ అధికారులు, అర్చక సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామారావుతో పాటు స్థానాచార్య శివప్రసాద్ శర్మ దంపతులు, వైదిక కమిటీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

ప్రారంభమైన జేఎన్‌టీయూ కే సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్


మిక్ కళాశాలలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కంచికచర్ల: స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ ప్రారంభించారు. పోటీలలో జేఎన్‌టీయూ పరిధిలో 60 జట్లు పాల్గొన్నాయని, ఫిబ్రవరి 26వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నిమ్మగడ్డ శౌరయ్య తెలిపారు. పోటీలకు పరిశీలకుడిగా డాక్టర్ జీపీ రాజు వ్యవహరించారు. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల ఇంజినీరింగ్ కళాశాలల క్రికెట్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. విజయవాడ ఆంధ్ర ఆసుపత్రి ఆర్థిక సహకారంతో ఈ పోటీలు జరుగుతున్నట్లు శౌరయ్య తెలిపారు. మిక్‌లో జరిగిన పోటీలో జీఐఈటీ(రాజమండ్రి)జట్టుపై ధనేకుల ఇంజినీరింగ్(విజయవాడ) జట్టు విజయం సాధించింది. అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల(పరిటాల)పై కైట్ ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ) జట్టు విజయం సాధించింది. ఎంఈఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో హేలాపురి ఇంజినీరింగ్ కళాశాల(ఏలూరు)జట్టుపై విష్ణు కళాశాల(భీమవరం) జట్టు విజయం సాధించింది. బీవీసీ కళాశాల(రాజమండ్రి)జట్టుపై లింగయ్యాస్ కళాశాల(విజయవాడ) జట్టు గెలిచింది. ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన టోర్నమెంట్‌లో వాసవి కళాశాల(నందమూరు)పై ఆదిత్య కళాశాల(కాకినాడ) జట్టు విజయం సాధించిందని శౌరయ్య తెలిపారు. అదనపు పీడీలు సీహెచ్ సురేష్, పి.పునీత్‌కుమార్, ఆర్.వెంకటరమణ పర్యవేక్షించారు. మండలంలోని పరిటాల ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజినీరింగ్ కళాశాల, ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో కూడా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరిగాయి.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

రూ.6.72 లక్షల విలువైన 112 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం


చోరీ సొత్తు, దొంగను మీడియాకు చూపుతున్న సీఐ ఏసుబాబు, ఎస్ఐ మూర్తి

గుడివాడరూరల్: గుడివాడ మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన చోరీల కేసులో దొంగను గుడివాడ తాలూకా పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.6.72 లక్షల విలువైన 112 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు గుడివాడ తాలూకా సీఐ కె.ఏసుబాబు తెలిపారు. గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు, దొంగను మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని కొత్తపేటకు చెందిన మద్దాని జగదీష్(24) గతంలో విజయవాడలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, గత ఏడాది జైలుకు వెళ్లి ఈ ఏడాది జనవరిలో బయటకు వచ్చాడన్నారు. ఈ క్రమంలో మండలంలోని మల్లాయపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీనగర్ కాలనీకి చెందిన మోతుక్కూరి అపర్ణ ఇంట్లో జనవరి 17వ తేదీన చోరీ చేశాడని, టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద నివాసముంటున్న నండూరి శ్రీనివాసరావు(సి-156 బ్లాక్, ఎస్-1) ఫ్లాట్‌లో కూడా అదే రోజు చోరీ చేశాడన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ నయీం హస్మీ ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ క్రమంలో లక్ష్మీనగర్ కాలనీ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న జగదీష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఈ రెండు చోరీలను తానే చేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ వెల్లడించారు. చోరీ సొత్తును దొంగ నుంచి స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. మోతుక్కూరి అపర్ణకు చెందిన సుమారు 10 గ్రాముల బంగారం, నండూరి శ్రీనివాసరావుకు చెందిన 102 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును రికవరీ చేసిన ఎస్ఐ ఎల్ఎస్ఎన్ మూర్తి, సిబ్బందిని సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో గురువారం రాత్రి జరిగింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబరు 52లో కొండ్రాజు మంగమ్మ తన రెండో కుమార్తె ముప్పాల తిరుపతమ్మ(27)తో కలిసి నివాసం ఉంటోంది. తిరుపతమ్మ భర్త నరసయ్య పూనేలో పని చేస్తుంటాడు. వీరికి ఇద్దరు సంతానం. మంగమ్మ, తిరుపతమ్మలు పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. గత 5 రోజులుగా తిరుపతమ్మ పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటోంది. గురువారం రాత్రి తిరుపతమ్మ కుమార్తె లక్ష్మీప్రసన్న స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చే సరికి తలుపునకు లోపలి వైపున గడియ వేసి ఉంది. ఇంట్లో ఉన్న తల్లి కోసం ఎంత పిలిచినా లోపలి నుంచి సమాధానం రాలేదు. ఇంతలో అమ్మమ్మ మంగమ్మ ఇంటికి రావడంతో జరిగిన విషయం చెప్పి, ఇద్దరూ తలుపులు కొట్టినా లాభం లేకపోవడంతో పక్క ఇంట్లో ఉండే కుర్రాడు వచ్చి బలవంతంగా తలుపులు తెరిచాడు. లోపలకు వెళ్లి చూసే సరికి మంచం గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరికి వేలాడుతూ తిరుపతమ్మ కనిపించింది. దీంతో వెంటనే ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను నమోదు చేసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భక్తుల కల్పవల్లి.. ఉయ్యూరు వీరమ్మతల్లి

- 19 నుంచి ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లు ప్రారంభం
- 15 రోజుల పాటు వైభవంగా ఉత్సవాల నిర్వహణ


శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మతల్లి

ఉయ్యూరు: భక్తుల కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన చల్లని తల్లి ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. మాఘశుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి) పర్వదినాన ప్రారంభమై 15 రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. తిరునాళ్ల మహోత్సవానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుంటారు.

ఎదురుగండ దీపాలతో హారతులు

అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సోమవారం రాత్రి 7.30 గంటలకు మొదలవుతుంది. తొలుత ఆచార సంప్రదాయం ప్రకారం పట్టణ పోలీసులు అమ్మవారికి చీర, సారె, పసుపు కుంకుమలు సమర్పిస్తారు. పారుపూడి, నెరుసు వంశస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. మెట్టినింట కొలువైన అమ్మవారిని బయటకు తీసుకొచ్చి పల్లకిలో కూర్చుండబెడతారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఎదురుగండ దీపాలతో హారతులతో స్వాగతం పలికి భక్తిపారవశ్యం చెందటంతో ఊరేగింపు మొదలై అమ్మవారు బయలుదేరుతుంది. ఊరేగింపు అనంతరం రెండో రోజు ప్రధాన సెంటరులో ఊయల ఉత్సవం జరుపుతారు. ఊయల ఉత్సవం పూర్తికావటంతో కనక చింతయ్య సమేతంగా అమ్మవారు ఆలయ ప్రవేశం చేసి భక్తుల పూజలందుకుంటారు.

శిడిబండి వేడుక

అమ్మవారి తిరునాళ్లలో 11వ రోజు ఈనెల 29న నిర్వహించే శిడిబండి వేడుక ప్రధాన ఘట్టం. ఉయ్యూరు దళిత వాడ నుంచి పెళ్లి కుమారుడు ఊరేగింపుగా తరలివచ్చి ప్రత్యేకంగా తయారుచేసిన శిడిబండిలో ఊరేగటంతో ఈ ఘట్టం ముగుస్తుంది. శిడిబండి ఉత్సవాన్ని తిలకించేందుకు అశేష భక్తజనం తరలివస్తారు. ఉత్సవాల్లో ప్రధానంగా జోడిపాట్టేళ్ల బండ్లు ఆకర్షణగా నిలుస్తాయి. భక్తులు జోడు పాట్టేళ్ల ప్రభ బండ్లతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుంటారు. భక్తుల పూజలతో మార్చి 4న ఉత్సవాలు ముగుస్తాయి. అనంతరం అమ్మవారు ఊరేగింపుగా మెట్టినింటికి చేరుకుని పూజలందుకుంటారు.

నేడు మంత్రి జోగి రమేష్ సమీక్ష

ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఈనెల 17న సమీక్ష నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, ఆలయ పాలకవర్గంతో సమీక్ష జరిపి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.